క్లుప్తంగా

16 నుంచి శ్రీవారి బ్రహ్మోత్సవాలు



ఎస్.అన్నవరంలో శ్రీవారి బ్రహ్మోత్సవాలకు పందిరి రాట వేస్తున్న అర్చకులు, భక్తులు

తుని రూరల్: మండలంలోని ఎస్.అన్నవరంలో కొలువైన శ్రీదేవి, భూదేవి సమేత ప్రసన్న వేంకటేశ్వరస్వామి పదో వార్షిక బ్రహ్మోత్సవాలు ఈ నెల 16 నుంచి 23 వరకూ నిర్వహించనున్నట్టు ఆలయ ధర్మకర్తలు తెలిపారు. ఆలయ అర్చకులు బుధవారం స్వామివారి బ్రహ్మోత్సవాలకు పందిరి రాట వేశారు. ఈ సందర్భంగా ధర్మకర్తలు మాట్లాడుతూ ఉత్సవాల్లో స్వామివారికి విశిష్ట సేవలు అందించేందుకు 15న భక్తులు గోవిందమాల దీక్షాధారణ చేస్తారన్నారు. అదేరోజు సాయంత్రం శ్రీవారి శోభాయాత్ర నిర్వహించనున్నట్టు తెలిపారు. 16న క్షీరాభిషేకంతో ఉత్సవ ఆరంభ స్నపనం, పల్లకీసేవ ఉంటుందన్నారు. 19న రాత్రి ఏడు గంటలకు శ్రీనివాస కల్యాణ మహోత్సవం, 20న లక్ష్మీనారాయణ వ్రతం, 23న మహాపూర్ణాహుతి, శ్రీపుష్పయాగం నిర్వహిస్తారని వివరించారు. పాత సంచుల వర్తక సంఘం, గ్రామ ప్రజల సహకారంతో ఉత్సవాలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు.

గర్భిణులకు వైద్య పరీక్షలు



శంఖవరం పీహెచ్‌సీలో గర్భిణులకు వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్లు

శంఖవరం: గర్భిణులు క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేయించుకోవాలని మండల వైద్యాధికారి డాక్టర్ ఆర్ఆర్‌వీ సత్యనారాయణ సూచించారు. ప్రధానమంత్రి మాతృత్వ సురక్ష అభియాన్‌లో భాగంగా స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో బుధవారం గర్భిణులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. సుమారు 20 మంది గర్భిణులకు డాక్టర్ రామ్‌రాజీవ్‌కుమార్ వైద్య పరీక్షలు చేసి మందులు అందజేశారు. ఆరోగ్యపరంగా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో వైద్యాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

సంక్షేమ ప్రభుత్వాన్ని మళ్లీ గెలిపించండి



కిర్లంపూడిలో బైక్ ర్యాలీ చేస్తున్న ముద్రగడ గిరిబాబు, పార్టీ శ్రేణులు

కిర్లంపూడి: అర్హత ఉన్న ప్రతి కుటుంబానికీ సంక్షేమ పథకాలు అందించి మేలు చేసిన వైఎస్సార్ సీపీ ప్రభుత్వాన్ని మళ్లీ గెలిపించాలని కాపు ఉద్యమ నేత, వైఎస్సార్ సీపీ నాయకుడు ముద్రగడ పద్మనాభం తనయుడు గిరిబాబు పిలుపునిచ్చారు. కిర్లంపూడిలో గురువారం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. పార్టీ శ్రేణులతో కలిసి ఇంటింటికీ వెళ్లి ఓట్లు అభ్యర్థించారు. ఈ సందర్భంగా గిరిబాబు మాట్లాడుతూ గత ఐదేళ్లలో రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించిందన్నారు. పేదలకు గతంలో ఎన్నడూలేని విధంగా సీఎం జగన్ సంక్షేమ పథకాలు అందజేశారని తెలిపారు. రాష్ట్రంలో సంక్షేమం, అభివృద్ధి కొనసాగాలంటే జగన్‌ను మళ్లీ ముఖ్యమంత్రిని చేయాలని కోరారు. తొలిత పెంట కోట నాగబాబు ఆధ్వర్యంలో కిర్లంపూడి, జగపతినగరం, చిల్లంగి గ్రామాల మీదుగా వైఎస్సార్ సీపీ నాయకులతో కలిసి భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు.

పోస్టల్ బ్యాలెట్ ద్వారా 1131 మంది ఓటింగ్

జగ్గంపేట: నియోజకవర్గంలో ఎన్నికల అధికారులు, సిబ్బంది పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కు వినియోగించుకున్నారు. నియోజకవర్గంలో పీఓ, ఏపీఓ, ఓపీఓ, ఎస్సెన్షియల్ ఓటర్లు మొత్తం 1769 మంది ఉండగా 1131 మంది ఓటుహక్కును వినియోగించుకున్నారని జగ్గంపేట ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఎం.శ్రీనివాసరావు తెలిపారు. గురువారంతో పోస్టల్ బ్యాలెట్ గడువు ముగియడంతో బ్యాలెట్ బాక్స్‌లకు సీలు వేశారు. జగ్గంపేట నియోజకవర్గంలో ఇతర జిల్లాల వారితో కలిపి మొత్తం 1769 మంది ఉద్యోగులు పోస్టల్ బ్యాలెట్ తీసుకున్నారని తెలిపారు. వీరిలో ఇతర జిల్లాలకు సంబంధించిన ఓట్లు 413 ఉన్నాయని చెప్పారు.

ఆర్అండ్ఆర్ కాలనీలో ఎన్ఆర్ఐల ప్రచారం

గోకవరం: కృష్ణునిపాలెం పంచాయతీ పరిధిలోని పోలవరం నిర్వాసితుల ఆర్అండ్ఆర్ కాలనీలో గురువారం సాయంత్రం ఎన్ఆర్ఐలు వైఎస్సార్ సీపీకి మద్దతుగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఎన్ఆర్ఐల బస్సు యాత్రలో భాగంగా ఎన్ఆర్ఐ మిర్తివాడ నాగిరెడ్డి కాలనీవాసులను కలుసుకుని రాష్ట్ర ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాలను వివరించారు. ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి వైఎస్సార్ సీపీని అఖండ మెజార్టీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు.

హ్యాట్రిక్ దిశగా ఫ్యాన్

- జగ్గంపేట నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీకి విశేష ప్రజాదరణ
- గత ఐదేళ్లలో ప్రగతి పథంలో పయనం
- ప్రచారంలో దూసుకుపోతున్న తోట నరసింహం
- చిరకాల ప్రత్యర్థుల మధ్యే ప్రధాన పోటీ



జగ్గంపేట నియోజకవర్గంలో ఎన్నికల ప్రచారం చేస్తున్న తోట నరసింహం

గోకవరం: మెట్ట ప్రాంతమైన జగ్గంపేట నియోజకవర్గంలో రాజకీయం వేడెక్కింది. మరో నాలుగు రోజుల్లో పోలింగ్ జరగనున్న నేపథ్యంలో అధికార, ప్రతిపక్ష పార్టీలు, స్వతంత్ర అభ్యర్థులు ప్రచారాన్ని ముమ్మరం చేశారు. జగ్గంపేటలో ప్రధానంగా వైఎస్సార్ సీపీ, టీడీపీ మధ్యే పోటీ నెలకొంది. ప్రజలు 2014, 2019 ఎన్నికల్లో వైఎస్సార్ సీపీకి పట్టం కట్టారు. 2014లో ప్రతిపక్షంలో ఉండగా, 2019లో అధికారం చేపట్టిన తరువాత నియోజకవర్గం అన్నివిధాలా అభివృద్ధి చెందింది. ముఖ్యంగా ప్రభుత్వాస్పత్రులు, ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు పూర్తిగా మారిపోయాయి. గోకవరం, గండేపల్లి మండలాల్లో నూతన ప్రభుత్వాస్పత్రుల నిర్మాణం జరిగింది. సచివాలయ, వలంటీర్ వ్యవస్థల ద్వారా ప్రజల ముంగిటకే ప్రభుత్వ సేవలు, పథకాలు రావడంతో ప్రజలు వైఎస్సార్ సీపీ వైపు మొగ్గు చూపుతున్నారు.

నియోజకవర్గంలో 2.16 లక్షల మంది ఓటర్లు

నియోజకవర్గంలో సుమారు 2.16 లక్షల మంది ఓటర్లు తమ ఓటు హక్కుని వినియోగించుకోనున్నారు. నియోజకవర్గంలో యువతకు ఉపాధి కల్పించేందుకు గోకవరం మండలం గుమ్మళ్లదొడ్డిలో రూ.250 కోట్లతో అస్సాగో ఇథనాల్ ఫ్యాక్టరీకి 2022, నవంబర్ నెలలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శంకుస్థాపన చేశారు. అలాగే నవరత్న పథకాల ద్వారా సంక్షేమ పథకాలను కులమతాలు, పార్టీలకు అతీతంగా అందించడంతో ప్రజలు మరోసారి వైఎస్సార్ సీపీకి పట్టం కట్టేందుకు సిద్ధమయ్యారు.

ప్రచారంలో దూసుకుపోతున్న 'తోట'

ఎన్నికల ప్రచారానికి గడువు సమీపిస్తుండటంతో ప్రధాన పార్టీలు ప్రచారంలో జోరు పెంచాయి. వైఎస్సార్ సీపీ జగ్గంపేట ఎమ్మెల్యే అభ్యర్థి తోట నరసింహం తన కుటుంబ సభ్యుల సహకారంతో ప్రచారంలో ముందంజలో ఉన్నారు. చెరగని చిరునవ్వుతో ప్రతిఒక్కరినీ ఆప్యాయంగా పేరు పెట్టి పలకరించడం ఆయనకు కలిసి వచ్చే అంశం. రెండు పర్యాయాలు ఎమ్మెల్యేగా గెలిచి మంత్రిగా పని చేయడంతో పాటు, ఒకసారి ఎంపీగా సేవలందించి నియోజకవర్గంలో పలు అభివృద్ధి పనులు చేసిన అనుభవం ఉండటంతో ప్రజలకు ఆయనకు బ్రహ్మరథం పడుతున్నారు. ఆయనతో పాటు భార్య వాణి, కుమారుడు రాంజీ, కుమార్తె ప్రసూన, కోడలు శ్రీనిధి ప్రచారంలో దూసుకుపోతున్నారు. వేసవి ఎండను సైతం లెక్కచేయకుండా నియోజకవర్గంలోని ప్రతి గ్రామంలోనూ పార్టీ శ్రేణులతో కలిసి ప్రతీరోజూ ఇంటింటికీ వెళ్లి ప్రచారం చేస్తున్నారు. ఈ ప్రచారానికి ప్రజల వద్ద నుంచి విశేష స్పందన లభిస్తోంది.

ముద్రగడ చేరికతో మరింత బలం

కాపు ఉద్యమనేత ముద్రగడ పద్మనాభం వైఎస్సార్ సీపీలోకి చేరిన తరువాత నియోజకవర్గంలో తోట నరసింహానికి మరింత బలం చేకూరింది. ఆయనతో పాటు కుమారుడు గిరిబాబు వైఎస్సార్ సీపీకి మద్దతుగా కిర్లంపూడి మండలంలో జోరుగా ప్రచారం నిర్వహిస్తున్నారు.

తోటకు కలిసిరానున్న సెంటిమెంట్

ప్రస్తుతం వైఎస్సార్ సీపీ, టీడీపీ అభ్యర్థులైన తోట నరసింహం, జ్యోతుల నెహ్రూ చిరకాల ప్రత్యర్థులు. వీరిద్దరూ 2004, 2009లో పోటీ పడగా రెండు పర్యాయాలు తోట నరసింహం విజయం సాధించారు. ఈ సెంటిమెంట్ కలిసి వచ్చి మరోసారి తోట విజయం సాధిస్తారని ఆ పార్టీ నాయకులు ధీమా వ్యక్తం చేస్తున్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాలతో పాటు ఈ సెంటిమెంట్ కలిసి వస్తుందని ప్రజలు సైతం భావిస్తున్నారు.

సైకిల్‌కు గ్లాస్ పంక్చర్ చేస్తుందా!

నియోజకవర్గంలో జనసేనలో అసంతృప్తి సెగలు చల్లారడం లేదు. పొత్తుధర్మంలో భాగంగా జగ్గంపేట సీటును టీడీపీకి కేటాయించడంతో అప్పటి వరకూ జనసేన పార్టీ ఇన్‌చార్జిగా ఉన్న పాటంశెట్టి సూర్యచంద్ర ఇండిపెండెంట్ అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేసి ప్రచారాన్ని ముమ్మరం చేశారు. ఇది ఇలా ఉండగా కూటమిలో తగిన ప్రాధాన్యం ఇవ్వడంలేదంటూ ఇటీవల గోకవరం మండల జనసేన పార్టీ మండలాధ్యక్షుడు ఉంగరాల మణిరత్నం, మరికొంత మంది కార్యకర్తలు జనసేన పార్టీని వీడారు. ఎన్నికల వేళ టీడీపీ, జనసేన పార్టీల నుంచి వైఎస్సార్ సీపీలోకి భారీగా వలసలు పెరిగాయి. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాలు, నియోజకవర్గంలో జరిగిన అభివృద్ధి వైఎస్సార్ సీపీ విజయానికి మరింత సహకరిస్తాయి. ఇలా అన్నీ అనుకూలంగా ఉండటంతో జగ్గంపేట నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీ హ్యాట్రిక్ కొడుతుందని ఇటు పార్టీ శ్రేణులు, అటు ప్రజలు భావిస్తున్నారు.

చివరిరోజు 29 మంది ఓటింగ్



ప్రత్తిపాడు ఫెసిలిటేషన్ సెంటర్‌లో పోస్టల్ బ్యాలెట్ బాక్సులకు సీలు వేస్తున్న సిబ్బంది

ప్రత్తిపాడు: సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా పోస్టల్ బ్యాలెట్ ద్వారా చివరిరోజు గురువారం 29 మంది ఉద్యోగులు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఫెసిలిటేషన్ సెంటర్‌లో ఉద్యోగులు ఓటు వేశారు. నియోజకవర్గంలో పీఓ, ఏపీఓ, ఓపీఓ, ఎస్సెన్షియల్ ఓటర్లు 1741 మంది ఉండగా ఏలేశ్వరం మండలంలోని 418 మంది, ప్రత్తిపాడు మండలంలోని 334 మంది, రౌతులపూడి మండలంలోని 314 మంది, శంఖవరం మండలంలోని 300 మంది, మరో 59 మంది ఎస్సెన్షియల్ ఉద్యోగులు వెరసి 1423 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. కాగా 72 మంది సర్వీసు ఓటర్లు, 141 మంది పోలీసు సిబ్బంది నూరు శాతం పోస్టల్ బ్యాలెట్‌ను వినియోగించుకున్నారని ప్రత్తిపాడు నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఎ.శ్రీనివాసరావు తెలిపారు. రాజకీయ పార్టీల ఏజెంట్ల సమక్షంలో అధికారులు పోస్టల్ బ్యాలెట్ బాక్సులకు సీలు వేశారు.

వచ్చే ఎన్నికల్లో విజయం ఖాయం

- వైఎస్సార్ సీపీ ప్రత్తిపాడు ఎమ్మెల్యే అభ్యర్థి వరుపుల సుబ్బారావు
- పలు గ్రామాల్లో ఎన్నికల ప్రచారం



ఎస్ఎన్ పట్నం శివారు ఎన్‌వీ నగరంలో ఎన్నికల ప్రచారం చేస్తున్న వరుపుల సుబ్బారావు

రౌతులపూడి: వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ విజయ ఢంకా మోగించి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ ముఖ్యమంత్రి కావడం ఖాయమని ఆ పార్టీ ప్రత్తిపాడు ఎమ్మెల్యే అభ్యర్థి వరుపుల సుబ్బారావు అన్నారు. మండలంలోని ఎస్ఎన్ పట్నం, లచ్చిరెడ్డిపాలెం గ్రామాల్లో గురువారం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. పార్టీ శ్రేణులతో కలిసి ఇంటింటికీ వెళ్లి ఓట్లు అభ్యర్థించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నవరత్న పథకాలతో పేదల జీవితాల్లో వెలుగులు నింపిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ఎన్నికల్లో ప్రజలు అండగా నిలవాలన్నారు. కుల మతాలు, రాజకీయాలకు అతీతంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించిన ఘనత ముఖ్యమంత్రికే దక్కుతుందన్నారు. కూటమి పార్టీల నేతలు ఎన్ని కుట్రలు చేసినా వైఎస్సార్ సీపీ విజయాన్ని ఆపలేరన్నారు. ఈ నెల 13న జరిగే ఎన్నికల్లో ప్రతిఒక్కరూ ఫ్యాన్ గుర్తుకు ఓట్లు వేసి కాకినాడ ఎంపీగా చలమలశెట్టి సునీల్‌ను, ప్రత్తిపాడు ఎమ్మెల్యేగా తనను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో మండల పరిషత్ ఉపాధ్యక్షుడు సూరెడ్డి సాయి, సర్పంచ్ సింగంపల్లి వెంకటలక్ష్మి, చిత్రా రమణమ్మ, మేడుపురెడ్డి రమణమ్మ, వైఎస్సార్ సీపీ నాయకులు సింగంపల్లి చిట్టిబాబు, నాగం రమేష్, గొర్లి శ్రీను, గుర్రం వెంకటరమణ, నరహరశెట్టి చంద్రం, లాలం గోవింద్ తదితరులు పాల్గొన్నారు.

అన్నవరంలో భారీ ర్యాలీ



అన్నవరం ర్యాలీలో ప్రజలకు అభివాదం చేస్తున్న వరుపుల సుబ్బారావు



ర్యాలీలో పాల్గొన్న పార్టీ శ్రేణులు, అభిమానులు

అన్నవరం: గత ఐదేళ్లుగా రాష్ట్రంలో అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు కొనసాగాలంటే వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిని చేయాలని వైఎస్సార్ సీపీ ప్రత్తిపాడు ఎమ్మెల్యే అభ్యర్థి వరుపుల సుబ్బారావు పిలుపునిచ్చారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా గురువారం సాయంత్రం అన్నవరంలో పార్టీ కార్యకర్తలు, అభిమానులతో కలిసి ఆయన భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మరే రాష్ట్రంలోనూ జరగని అభివృద్ధి ఏపీలో జరిగిందంటే అందుకు ప్రధాన కారకుడు ముఖ్యమంత్రి జగన్ అన్నారు. తనను గెలిపిస్తే నియోజకవర్గంలో నీటిపారుదల ప్రాజెక్ట్‌ల ద్వారా ఆయకట్టుకు పూర్తిస్థాయిలో సాగునీరు అందిస్తానన్నారు. ప్రముఖ పుణ్యక్షేత్రమైన అన్నవరాన్ని అన్నివిధాలా అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తానన్నారు. వచ్చే ఎన్నికల్లో ప్రతిఒక్కరూ ఫ్యాన్‌గుర్తుపై ఓటువేసి కాకినాడ ఎంపీగా చలమలశెట్టి సునీల్, ప్రత్తిపాడు ఎమ్మెల్యేగా తనను గెలిపించాలని కోరారు. గ్రామ శివారులోని బీసీ కాలనీ నుంచి ర్యాలీ ప్రారంభం కాగా అడుగడుగునా ప్రజలు ఘన స్వాగతం పలికారు. బీసీ కాలనీలో నాయీబ్రాహ్మణులు వరుపుల సుబ్బారావును శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో శంఖవరం ఎంపీపీ పర్వత రాజబాబు, అన్నవరం సర్పంచ్ శెట్టిబత్తుల కుమార్ రాజా, వైస్ సర్పంచ్ బొబ్బిలి వెంకన్నబాబు, ఎంపీటీసీ దడాల సతీష్, పార్టీ నాయకులు పర్వత మోహన్, కొండపల్లి అప్పారావు, సరమర్ల మధుబాబు, మెరపల బాబూరావు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర ప్రగతికి జగన్‌ను మళ్లీ గెలిపించండి



రామవరంలో ఎన్నికల ప్రచారం చేస్తున్న తోట నరసింహం

- వైఎస్సార్ సీపీ జగ్గంపేట ఎమ్మెల్యే అభ్యర్థి తోట నరసింహం
- పలు గ్రామాల్లో ఎన్నికల ప్రచారం

జగ్గంపేట: రాష్ట్రం ప్రగతి పథంలో మరింత ముందడుగు వేయాలంటే వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిగా గెలిపించాలని వైఎస్సార్ సీపీ జగ్గంపేట ఎమ్మెల్యే అభ్యర్థి తోట నరసింహం అన్నారు. మండలంలోని రామవరం నుంచి గురువారం ఆయన ప్రచారం రథంపై రోడ్ షో ద్వారా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ నేతలు, కార్యకర్తలు, అభిమానులు భారీ బైక్ ర్యాలీ చేపట్టారు. రామవరం నుంచి ప్రారంభమైన మోటారు సైకిళ్ల ర్యాలీ ఇర్రిపాక, మామిడాడ, నరేంద్రపట్నం, భావవరం తదితర గ్రామాల మీదగా సాగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా సంక్షేమమే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమన్నారు. ప్రతిపక్షాలు, కూటమి ఎన్ని కుట్రలు పన్నినా జగన్ గెలుపును అడ్డుకోలేరన్నారు. పేదల గుండెల్లో సీఎం జగన్ ఉన్నారన్నారు. పార్టీలకు అతీతంగా, పారదర్శకంగా రాష్ట్రంలో సంక్షేమ పథకాలను అమలు చేసింది వైఎస్సార్ సీపీ ప్రభుత్వమే అన్నారు. ఈ నెల 13న జరిగే ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి కాకినాడ ఎంపీగా చలమలశెట్టి సునీల్, జగ్గంపేట ఎమ్మెల్యేగా తనను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో జగ్గంపేట నియోజకవర్గ ఎన్నికల సమన్వయకర్త అత్తులూరి సాయిబాబు, పార్టీ మండలాధ్యక్షుడు రావుల గణేష్‌రాజా, వైఎస్సార్ సీపీ నేతల గఫూర్, రామకుర్తి జగాల్, దంతులూరి కృష్ణంరాజు, గుర్రం మహాలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

పథకాల అమలు సీఎం జగన్‌కే సాధ్యం



జగన్నాథగిరిలో ఎన్నికల ప్రచారం చేస్తున్న మంత్రి రాజా తనయుడు శంకర్ మల్లిక్, సతీమణి లక్ష్మీచైతన్య

- మంత్రి దాడిశెట్టి రాజా సతీమణి లక్ష్మీచైతన్య, తనయుడు శంకర్ మల్లిక్
- పలు గ్రామాల్లో ఎన్నికల ప్రచారం

తుని రూరల్: రాష్ట్రంలో సంక్షేమ పథకాల అమలు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే సాధ్యమని రోడ్లు, భవనాలశాఖ మంత్రి, వైఎస్సార్ సీపీ తుని ఎమ్మెల్యే అభ్యర్థి దాడిశెట్టి రాజా సతీమణి లక్ష్మీచైతన్య, తనయుడు శంకర్ మల్లిక్ అన్నారు. మండలంలోని జగన్నాథగిరి, రామకృష్ణ నగర్, గెడ్లబీడు గ్రామాల్లో బుధవారం వారు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. తుని మున్సిపల్ చైర్‌పర్సన్ ఏలూరి సుధారాణి, పార్టీ శ్రేణులతో కలసి లక్ష్మీచైతన్య, శంకర్ మల్లిక్ ఇంటింటికీ వెళ్లి ఓట్లు అభ్యర్థించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ సీఎం అయితేనే సంక్షేమ పథకాలు అమలవుతాయన్నారు. మహిళలను అన్ని రంగాల్లో ముందంజలో నిలిపేందుకు వైఎస్సార్ సీపీ ప్రభుత్వం కృషి చేసిందన్నారు. టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు చేస్తున్న తప్పుడు ఆరోపణలు, హామీలను నమ్మి మోసపోవద్దన్నారు. ఈ నెల 13న జరిగే సార్వత్రిక ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు రెండు ఓట్లు వేసి తుని ఎమ్మెల్యేగా దాడిశెట్టి రాజాను, కాకినాడ ఎంపీగా చలమలశెట్టి సునీల్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో పలువురు వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సీఎం జగన్‌తోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యం



జగపతినగరంలో ఎన్నికల ప్రచారం చేస్తున్న ప్రసూన, శ్రీనిధి

కిర్లంపూడి: సీఎం జగన్‌తోనే రాష్ట్రాభివృద్ధి, సంక్షేమ పథకాల అమలు సాధ్యమని ప్రత్తిపాడు వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి తోట నరసింహం కుమార్తె ప్రసూన, కోడలు శ్రీనిధి అన్నారు. మండలంలోని జగపతినగరంలో గురువారం వారు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. దాడి చిన బుజ్జి ఆధ్వర్యంలో ఇంటింటికీ వెళ్లి ఓట్లు అభ్యర్థించారు. ఈ నెల 13న జరిగే ఎన్నికల్లో కాకినాడ ఎంపీగా చలమలశెట్టి సునీల్‌ను, జగ్గంపేట ఎమ్మెల్యేగా తోట నరసింహాన్ని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని అభ్యర్థించారు. కార్యక్రమంలో పార్టీ మండల ఇన్‌చార్జి తోట బాబ్జీ, మండల సచివాలయాల కన్వీనర్ జోకా శ్రీను, దోమాల గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీకి గిరిజన సంఘాల మద్దతు



లింగంపర్తిలో వరుపుల సుబ్బారావుకు మద్దతు తెలుపుతున్న గిరిజన సంఘాల నాయకులు

ఏలేశ్వరం: వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీకి గిరిజన సంఘాలు తమ పూర్తి మద్దతును ప్రకటించాయి. ఈ మేరకు మండలంలోని లింగంపర్తిలో గురువారం వైఎస్సార్ సీపీ ప్రత్తిపాడు ఎమ్మెల్యే అభ్యర్థి వరుపుల సుబ్బారావును గిరిజన సంఘాల నాయకులు కలిసి మద్దతు ప్రకటించారు. నేషనల్ ట్రైబల్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు మానుపాటి నవీన్, ఎరుకుల ఆత్మగౌరవ సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మద్దెల రామకృష్ణ, యానాది సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కుడుమల రామచంద్రయ్యతో పాటు పలు సంఘాల నాయకులు వరుపుల సుబ్బారావును కలిశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గిరిజన, బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అనేక సంక్షేమ పథకాలు అమలు చేశారన్నారు. సీఎం జగన్‌తోనే బలహీన వర్గాలకు న్యాయం జరుగుతుందన్నారు. చంద్రబాబు మోసపూరిత వాగ్దానాలను నమ్మి మోసపోవద్దని సూచించారు. రాష్ట్రవ్యాప్తంగా చేస్తున్న గిరిజన రాజకీయ చైతన్య యాత్రలో భాగంగా వరుపులను కలిసినట్టు తెలిపారు. అన్నివర్గాలకూ మేలు చేసిన సీఎం జగన్‌కు ప్రజలు అండగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో సంఘ నాయకులు తోకల చిన్న, జగన్నాథం చంటి, కేసనం హేమంత్, మాణిక్యం, హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు.

మహిళల పక్షపాతి సీఎం జగన్

- వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి వరుపుల సుబ్బారావు సతీమణి వెంకటలక్ష్మి
- లింగంపర్తిలో ఎన్నికల ప్రచారం



లింగంపర్తిలో ఎన్నికల ప్రచారం చేస్తున్న వరుపుల వెంకటలక్ష్మి

ఏలేశ్వరం: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మహిళల పక్షపాతి అని వైఎస్సార్ సీపీ ప్రత్తిపాడు ఎమ్మెల్యే అభ్యర్థి వరుపుల సుబ్బారావు సతీమణి వెంకటలక్ష్మి అన్నారు. మండలంలోని లింగంపర్తిలో గురువారం ఆమె ఎన్నికల ప్రచారం నిర్వహించారు. పార్టీ శ్రేణులతో కలిసి ఇంటింటికీ వెళ్లి ఓట్లు అభ్యర్థించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి మహిళల కోసం అనేక సంక్షేమ పథకాలను అమలు చేశారన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో మహిళలకు ఆర్థిక భరోసా కలిగిందన్నారు. అమ్మ ఒడి, వైఎస్సార్ ఆసరా, జగనన్న చేదోడు తదితర పథకాలతో మహిళలకు ఎంతో మేలు జరిగిందన్నారు. ఎన్నికల్లో మహిళలు వైఎస్సార్ సీపీకి అండగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో పార్టీనాయకులు, మహిళలు పాల్గొన్నారు.